సంపుటి :03 | సంచిక :50 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 2, ఏప్రిల్ 2026

## సాగు రైతుల కల నెరవేరాలి

○ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

04



## మే 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు

### ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు

అక్షరదర్బార్, భూపాలపల్లి: మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెవెన్యూ, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు కేటాయించిన పనులను సమన్వయంతో నిర్వహించి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలు, వైద్య సదుపాయాలు కూడా సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకుంటున్న తరుణంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేరు మరోసారి రాజకీయ తెరపైకి వచ్చింది. 2023లో ప్రభుత్వం ఏర్పడిన సమయంలోనే కేబినెట్‌లో చోటు ఆశించినా, సామాజిక సమీకరణల దృష్ట్యా ఆయనకు అవకాశం చేజారింది. అయితే, ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం జరగబోయే తాజా విస్తరణలో మాధవరెడ్డికి మంత్రి పదవి దక్కడం ఖాయమని పార్టీ శ్రేణులు, రాజకీయ విశ్లేషకులు బలంగా విశ్వసిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మాధవరెడ్డికి మధ్య ఉన్న గ్యాప్ ఇప్పుడు పూర్తిగా తొలిగిపోయింది. రేవంత్ రెడ్డి నేరుగా దొంతి స్వగ్రామానికి వెళ్లి పరామర్శించడం, ఆ తర్వాత నర్సంపేట పర్యటనతో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. 45 ఏళ్ల రాజకీయ అనుభవం, క్లిష్ట కాలంలోనూ కాంగ్రెస్‌ను వీడని నైజం మాధవరెడ్డికి ప్లస్ పాయింట్లుగా మారాయి. వరంగల్ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ, సీనియారిటీ కోటాలో దొంతికి చోటు కల్పించడం ద్వారా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. ఈనెల 15 తర్వాత జరగబోయే విస్తరణలో దొంతికి 'మంత్రి' యోగం పడుతుందో లేదో చూడాలి.

– అక్షరదర్బార్, వరంగల్



# మంత్రి పదవి రేసులో దొంతి!

### 2023లోనే మంత్రివర్గంలో స్థానం ఆశించిన మాధవరెడ్డికి నిరాశ

- ఆ తర్వాత జరిగిన కేబినెట్ విస్తరణలోనూ దొంతికి దక్కని చాన్స్
- ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత త్వరలో జరగనున్న కేబినెట్ విస్తరణ
- ఈసారి సీనియారిటీ కోటాలో మాధవరెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు లభించే అవకాశం
- మారిన సమీకరణల నేపథ్యంలో ఆయనకు కేబినెట్ లో బెర్త్ ఖాయమని పార్టీ శ్రేణుల విశ్వాసం

03

## కాజీపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.50 లక్షల సీసీ రోడ్డు పనులకు మేయర్‌తో కలిసి శంకుస్థాపన



అక్షరదర్బార్, కాజీపేట: గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వెనుకబడిన కాజీపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలుపుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. '99 రోజుల ప్రణాళిక ప్రగతి పాలన'లో భాగంగా 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. గతంలో కేవలం రాజకీయాల కోసమే శంకుస్థాపనలు చేసి పనులను గాలికి వదిలేశారని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి పనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. కాజీపేటలో వైద్య రంగంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలోనే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ అంటూ గొడవ చేసే నాయకుల తీరును ప్రజలు గమనించాలని నాయిని సూచించారు. నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్ల పనులు ప్రతి డివిజన్‌లో వేగంగా సాగుతున్నాయని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తమిళనాడు

## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

### రూ.15.20 లక్షల విలువైన 95 గ్రాముల బంగారం స్వాధీనం

### ఐదు దొంగతనాల గుట్టురట్టు

### నిందితులు మధురై వాసులు

05




## మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వం అధిక ప్రాధాన్యత తో జిల్లా అభివృద్ధి
- త్వరలోనే మల్లంపల్లి మండల పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- మంత్రి సీతక్క

04

అక్షర దర్బార్ Voice of the People

## వైద్యుడిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

○ నర్సంపేట టౌన్ సీఐ శ్రీనివాస్

నర్సంపేట, అక్షర దర్బార్ : వైద్యుడిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు నర్సంపేట టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఉన్న వేద స్కానింగ్ సెంటర్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిని నర్సంపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల ఫిబ్రవరి 19 న నర్సంపేట పట్టణానికి చెందిన వైద్యుడు ములుగు సతీష్ రిఫర్ చేసిన ఒక యువతికి వేద స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ నిర్వహించి రిపోర్టు ఇచ్చారు. అయితే ఆ రిపోర్టు తప్పుగా ఇచ్చారని ఆరోపిస్తూ మార్చి 22 న ఆ యువతి కుటుంబ సభ్యులు నలుగురు కలిసి స్కానింగ్ సెంటర్‌కు వచ్చి డాక్టర్‌పై దాడి చేశారన్నారు. ఈ ఘటనకు సంబంధించి దాడి చేసిన వ్యక్తి మోడెం విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. వైద్యులపై దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవి కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రొటోకాల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలి

మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు

దుగ్గొండి, అక్షర దర్బార్ : ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక పట్ల రేపటి నుండి నిర్వహించే గ్రామ సభలను ప్రొటోకాల్ ప్రకారంగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు సూచించారు. బుధవారం దుగ్గొండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు,గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులతో గ్రామ సభల నిర్వహణ పట్ల ఎంపిడిఒ లెక్కల అరుంధతి అధ్యక్షతన అవాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సమ్మక్క, ఎంపీఓ మోడెం శ్రీధర్ గౌడ్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎస్సై రణధీర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



# పట్టణానికి ధీటుగా విలీన గ్రామాలను అభివృద్ధి చేస్తా

### నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండం శ్రీలక్ష్మి రామానంద్

నర్సంపేట, అక్షర దర్బార్ : నర్సంపేట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను పట్టుణానికి ధీటుగా.ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండం శ్రీలక్ష్మి రామానంద్ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలో విలీనమైన నాగుర్లపల్లి, పర్శునాయక్ తండా 16వ వార్డును మున్సిపల్ యంత్రాంగంతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్‌తో కలిసి గ్రామంలోని డంపింగ్ యార్డ్, బతుకమ్మ ఆడుట స్థలం, పల్లె దవాఖాన, మట్టి రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించారు.విలీన గ్రామ ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి పౌర సేవలను సమర్థవంతంగా అందించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడం, పారిశుధ్యంపై ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయడం, అవసరమైన చోట వీధి దీపాలను ఏర్పాటు చేయడం



జరుగుతుందని తెలిపారు.పార్టీలకతీతంగా ఎలాంటి బేషజాలం లేకుండా 16వ వార్డు అభివృద్ధి కోసం అవసరమైన నిధులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరు చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్యులు మేఘ్య నాయక్, శంకర్ నాయక్, క్రాంతి కుమార్, కొర్ర రాహుల్, కొర్ర రాజన్న తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో బలంగా జనసేన

○ పార్టీ జిల్లా నాయకుడు దేవేందర్ కంకణాల

అక్షర దర్బార్, చిట్యాల : తెలంగాణలో జనసేన పార్టీ అత్యధిక సభ్యత్వలను నమోదు చేసుకుంటూ బలమైన పార్టీగా ఎదుగుతున్నదని ఆ పార్టీ జిల్లా నాయకులు కంకణాల దేవేందర్ తెలిపారు. బుధవారం చిట్యాల మండలంలో నిర్వహించిన జనసేన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యువత పార్టీ వైపు ఆకర్షితులవడం జనసేన బలానికి నిదర్శనమని అన్నారు. ప్రత్యేకంగా చిట్యాల మండలంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు అవుతున్నాయని జిల్లా నాయకులు దేవేందర్ తెలిపారు. ప్రజల కష్టాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించడం నిజమైన రాజకీయాల లక్ష్యం. ఇదే భావంతో ముందుకు సాగుతున్న జనసేన పార్టీ, యువతను సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీపై యువతలో విశేష స్పందన కనిపిస్తోందని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు కావడమే ఎందుకు నిదర్శనం అన్నాడు గర్వకారణం. భూపాలపల్లి నియోజకవర్గంలో కూడా భారీ స్థాయిలో



సభ్యత్వ నమోదు జరుగుతోందని తెలిపారు. ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారు కొండగట్టు ఆలయంలో స్వాముల మాల విరమణ మండపం నిర్మాణానికి 35 కోట్ల రూపాయలు ప్రకటించడం, తెలంగాణ అభివృద్ధికి ఆయన కట్టుబాటు ఉన్నదనడానికి స్పష్టమైన ఉదాహరణ అని దేవేందర్ కంకణాల పేర్కొన్నారు. ఈ సమావేశంలో చిట్యాల కోఆర్డినేటర్ రమణ్‌కుమార్, టేకుమట్ల జనసేన కోఆర్డినేటర్ మధుకర్, మొగుళ్లపల్లి కోఆర్డినేటర్ విజయ్ పాల్గొన్నారు.

# అంగన్వాడీ బరువు, ఎత్తు నమోదు చేయాలి

అక్షర దర్బార్ చిట్యాల : అంగన్వాడి సెంటర్లకు వచ్చే పిల్లలందరి బరువు ఎత్తు చూసి నమోదు చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద అంగన్వాడీ టీచర్లను కోరారు బుధవారం చిట్యాల మండల కేంద్రంలోని ఐదవ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ జ్యోతి నిర్వహించిన గ్రోత్ మేలా ఫోగ్రాముకు జయప్రద సూపర్వైజర్ హాజరై పిల్లల ఎత్తు బరువును చూశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరినీ ప్రతినెల 1వ తేదీ నుండి 5వ తేదీలోగా అంగన్వాడీ కేంద్రాలలో బరువు, ఎత్తు చూపించుకుని బాలమృతం, ఎగ్స్ తీసుకొని పిల్లలలో పోషకాహార లోపాన్ని తగ్గించుటకు తల్లులు సహకరించాలన్నారు. పిల్లల శారీరక ఎదుగుదలకు బాలమృతంను తప్పనిసరి రోజుకు 100 గ్రాముల చొప్పున వేడి పాలలో కాని, నీళ్లలో కాని కలిపి తినిపించాలని అప్పుడే పిల్లలు



వయసులవారిగా పెరగాల్సిన బరువు, ఎత్తు పెరిగి ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు బాలామృతం, ఎగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శైలజ మహిళలు తల్లులు పాల్గొన్నారు.



## సన్న బియ్యం పంపిణీలో కౌన్సిలర్లు

అక్షరదర్బార్, పరకాల: దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం ప్రజలకు ఉపయోగపడుతోందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెలలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం ప్రత్యేకతగా నిలిచిందన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిలకు కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజలకు కడుపునిండా అన్నం అందించడంలో ప్రభుత్వం కృషి చేస్తోందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్, బండి శ్రీధర్, సుధమల్ల రమేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు స్వామి, బండి రాజేందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలంలోని నాయన పాక గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం ఉపాధ్యాయుల అవతారమెత్తి అలరించారు. ఉదయాన్నే ఉపాధ్యాయుల వేషధారణతో పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులుగా పాఠాలను బోధిస్తూ సూపర్ లను ఆకట్టుకున్నారు అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఊర్మిళ గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా నటించిన విద్యార్థుల అనుభవాలను తెలుసుకొని వారిని అభినందించారు తమ తమ జీవితంలో ఉన్నతమైన విద్యనందుకుని అత్యున్నతమైన శిఖరాలకు చేరుకొని సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సూపర్ పాలన దినోత్సవం స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థి హెచ్ఎం గా మామిడి విశ్వతేజ ఎంఈఓ గా రేపాల శ్రేయాన్సీ కాంప్లెక్స్ హెచ్ఎం గా సమత ఉపాధ్యాయులుగా శ్రీకాంత్ సోనుచందు హారిక వైష్ణవి క్రీషిత్ రుత్విక్ జాహ్నవి వరుణ్ తేజాలు విధులను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనిల్ గవాస్కర్ శ్యాంసుందర్ విక్రముద్దీన్ సదానందం హసీనా తదితరులు పాల్గొన్నారు.




# శిథిలావస్థలో పరకాల గ్రంథాలయం

## కొత్త భవనం, డిజిటల్ సౌకర్యాల కోసం విద్యార్థుల వినతి

### సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేవూరి

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుని విద్యార్థులు, నిరుద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. పాత భవనం కావడంతో పైకప్పు పెచ్చులు ఊడిపడుతూ ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయం నెలకొంది. రోజుకు సుమారు 300 మందికిపైగా పాఠకులు వినియోగిస్తున్న ఈ గ్రంథాలయానికి సరైన సౌకర్యాలు లేకపోవడం సమస్యగా మారింది.

కొత్త భవనం నిర్మించాలని గతంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం లేకపోవడంతో మంగళవారం విద్యార్థులు, నిరుద్యోగులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని కలిశారు. బొచ్చు రాజు స్వేరో ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి గ్రంథాలయాన్ని పాత మున్సిపల్ కార్యాలయానికి తరలించాలని కోరారు.దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. పాత మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ లైబ్రరీ, వైఫై సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ నిర్ణయంపై విద్యార్థులు, నిరుద్యోగులు ఎమ్మెల్యేకు



కృతజ్ఞతలు తెలిపారు.పోటీ పరీక్షలకు అనుగుణంగా కొత్త పుస్తకాలు అందుబాటులోకి తేవాలని, శాశ్వతంగా ఆధునిక గ్రంథాలయ భవనం నిర్మించాలని పాఠకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చిట్యాల ఎస్.ఐ పోచంపల్లి సతీష్

అక్షర దర్బార్, చిట్యాల : వివిధ రకాల సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ విజ్ఞప్తి చేశారు బుధవారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పంథాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోచంపల్లి సతీష్ విజ్ఞప్తి చేశారు. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ మీ పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి" లేదా "మీరు క్రైమ్ చేశారు" అని భయపెట్టి, వీడియో కాల్ ద్వారా మిమ్మల్ని గంటల తరబడి బంధించి భయపెట్టి డబ్బులు వసూలు చేస్తారు. గుర్తుంచుకోండి, ఏ ప్రభుత్వ సంస్థ కూడా వీడియో కాల్ ద్వారా అరెస్టులు చేయదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని టెలిగ్రామ్ లేదా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆశ చూపిస్తారు. నకిలీ వెబ్‌సైట్లలో లాభాలు కనిపిస్తున్నట్లు నమ్మించి, భారీగా డబ్బులు కట్టించుకుని మోసం చేస్తారు. ఎనీ డెస్క్ టీం వీవర్ వంటి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయమని కోరితే ఎప్పుడూ చేయకండి. వీటి ద్వారా మీ ఫోన్ నియంత్రణను వారు తీసుకుని, మీ బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తారు.

మీ బ్యాంక్ ఖాతా లేదా సిమ్ కార్డ్ క్లోజ్ అవుతుందని మెసేజ్‌లు పంపి, లింక్‌లు క్లిక్ చేయమని కోరుతారు. బ్యాంకులు ఎప్పుడూ ఫోన్ ద్వారా లేదా లింక్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు అడగవు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని కోరారు. నేరాల నియంత్రణలో సిసిటివిల పాత్రను గుర్తించి, చిట్యాల లారీ యూనియన్ వారు సామాజిక బాధ్యతగా రూ. 20,000/- ఆర్థిక సహాయాన్ని ఎస్.ఐ సతీష్ గారికి అందజేశారు. ఈ మొత్తాన్ని పట్టణంలో ముఖ్య ప్రాంతాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటుకు వినియోగించనున్నట్లు ఎస్.ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.



# మీసేవ ఛార్జీల పెంపు

- 3 నుంచి 5 వరకు సేవలు బంద్!

అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా మీసేవ సర్వీసుల ఛార్జీలు పెరిగినట్లు మీసేవ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి సతీష్ కుమార్ తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచే పెరిగిన ఛార్జీలు అమల్లోకి వచ్చాయని, పదేళ్ల తర్వాత ఛార్జీలు పెంచినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సర్వర్ అప్‌డేట్ కారణంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మీసేవ సేవలు పనిచేయవని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తమ మిగతా డిమాండ్లను కూడా ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

mee seva
easier, faster

# ప్రజల చెంతకే పాలన

## నేడు 'ప్రజా పాలన' గ్రామ సభలు

- 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంపై అధికారుల ఉన్నత స్థాయి సమీక్ష
- సభల్లో సీఎం సందేశం వినిపించాలని, లబ్ధిదారుల జాబితా చదవాలని ఆదేశం




అక్షర దర్బార్, మల్హర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమం'లో భాగంగా గురువారం నిర్వహించనున్న గ్రామ సభల ఏర్పాట్లపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని సభల నిర్వహణపై చర్చించారు. గ్రామ సభల ప్రారంభంలో గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారి సందేశాన్ని ఆడియో లేదా వీడియో ద్వారా ప్రజలందరికీ వినిపించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, వివిధ సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలను సభలో స్పష్టంగా చదివి వినిపించాలని సూచించారు.

### సమన్వయంతో విజయవంతం చేయాలి..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే ఈ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమ ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి అవాంతరాలు లేకుండా గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు. ప్రజలందరూ ఈ సభలకు పెద్ద ఎత్తున హాజరై ప్రభుత్వ ఫలాలను అందుకోవాలని పిలుపునిచ్చారు.

# అత్యాచారం క్షమించరాని నేరం

## 'సమాజమా స్పందించుమా' సాంగ్ ఆవిష్కరణ

- మహిళల రక్షణ అందరి బాధ్యత
- శాయంపేట సీఐ రంజిత్ రావు

అక్షర దర్బార్, శాయంపేట: మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఎండగడుతూ, సామాజిక స్పృహ కల్పించే ఉద్దేశంతో రూపొందించిన 'సమాజమా స్పందించుమా.. అత్యాచారం క్షమించరాని నేరం' పాటను శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్ఐ పరమేశ్వర్ బుధవారం ఆవిష్కరించారు. రచయిత మొగ్గం సుమన్ రాసిన ఈ పాటను సింగర్ తుడుం క్రాంతి కుమార్ ఆలపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ ప్రాముఖ్యతను తెలిపేలా ఇలాంటి పాటలు రావడం అభినందనీయమన్నారు. ఆడవారిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వంగాల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెండింగ్ బిల్లులను విడుదల చేసి పనులకు వేగం తీసుకువచ్చామని తెలిపారు.



త్వరలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రారంభోత్సవం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందని పేర్కొన్నారు. అలాగే టీయూఎఫ్ఐడీసీ నిధులతో పరకాల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ప్రభుత్వ ఆస్పటల్ సూపర్డెంట్ గౌతమ్ చౌహన్, పరకాల పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వం అధిక ప్రాధాన్యత తో జిల్లా అభివృద్ధి
- త్వరలోనే మల్లంపల్లి మండల పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- మంత్రి సీతక్క



అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి: మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలని, ములుగు జిల్లా ప్రత్యేక చొరవతో అభివృద్ధి లో ముందుకు సాగాలని, త్వరలోనే మండల పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపాధి హామీ పథకం పది లక్షల రూపాయల నిధులతో గ్రామైక్య సంఘం భవన నిర్మాణానికి, సి ఆర్ ఆర్ 72.50 లక్షల రూపాల నిధులతో అంతర్గత సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

అనంతరం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఉపాధి హామీ పథకం 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., శ్రీనగర్ సర్పంచ్ మల్లేష్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని మల్లంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం అని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడగానే మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ప్రకటించి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. నూతన మల్లంపల్లి మండల కేంద్రం లో మండల సమైక్య భవనాలు రెండు నిర్మిస్తున్నామని, పరిపాలన సౌలభ్యం కోసం ఎంపీడీఓ, ఎంఆర్ఓ ఆఫీసులను ఒకే చోట మండల సముదాయ భవనం నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అంగడి స్థలాన్ని మాస్టర్ ప్లాన్ తో ప్రజల అవసరాల కోసం అభివృద్ధి చేస్తామని, త్వరలోనే పోలీస్ స్టేషన్ మరియు అవసరమైన సిబ్బందిని కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డి ఆర్ డి ఓ, శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ సునీత, మండల ప్రత్యేక అధికారి కృపాకర్, సర్పంచ్ శ్యామ్ రావు, యం పి ఓ, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- మక్కలను కేంద్రాల్లోనే అమ్ముకోవాలి
- క్వింటాకు రూ. 2400 మద్దతు ధర..
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ
- చిట్యాలలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



అక్షర దర్బార్, చిట్యాల: రైతులు తాము పండించిన మక్కలను (మొక్కజొన్న) దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని మద్దతు ధర పొందాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. బుధవారం చిట్యాల మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

**మండలానికి ప్రత్యేక కేంద్రం..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం సంబంధిత మంత్రితో మాట్లాడి మండలానికి కొనుగోలు కేంద్రాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. క్వింటాకు రూ. 2400 మద్దతు ధరతో మక్కలను కొనుగోలు చేయడం జరుగుతుందని వెల్లడించారు. రైతులు దళారుల దగ్గరకు వెళ్లకుండా నేరుగా కేంద్రాలకే తమ పంటను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ వంటి అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమామ్ బాబా, ఎంపీడీవో జయశ్రీ, మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సత్యం, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మిత్రుడి తండ్రి మృతి.. 2005 బ్యాచ్ స్నేహితుల ఆర్థిక చేయూత

- రూ. 15 వేల సాయం అందజేసి మానవత్వం చాటుకున్న వైనం



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: తమతో పాటు చదువుకున్న మిత్రుడికి కష్టం వస్తే మేమంతా ఉన్నామంటూ 2005 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు అండగా నిలిచారు. మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన మ్యాదరి రాజేందర్ తండ్రి దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించి, రూ. 15 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైనాల మహేందర్, బాల్త రాజు తదితర స్నేహితులు పాల్గొన్నారు.



# సాగు రైతుల కల నెరవేరాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- అర్హులైన రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేయాలని ఆదేశం

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివాదాల్లేని ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతులకు గ్రామసభలు నిర్వహించి, పారదర్శకంగా అర్హులైన వారిని గుర్తించి పట్టాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ధర్మారావుపేట గ్రామంలో సింగరేణి గనుల ఏర్పాటు వల్ల భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, మిగిలిన భూముల్లో సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. పట్టాలు లేకపోవడం వల్ల రైతులు 'రైతు భరోసా', 'రైతు బీమా' వంటి ప్రభుత్వ ఫలాలను పొందలేకపోతున్నారని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులకు తెలిపారు.

**సర్వేకు కలెక్టర్ ఆదేశం**

కోర్టు వివాదాలు లేని సాగు భూములను లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి నవీన్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ, భూపాలపల్లి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

## చెట్ల నరికివేతపై
# అటవీశాఖ సీరియస్

- నిందితులపై 'వాల్టా' అస్త్రం!
- తాల్లకుంట చెరువు వద్ద కాల్చిన చెట్ల అవశేషాల పరిశీలన

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలోని తాల్లకుంట చెరువు పరిసరాల్లో పదేళ్ల క్రితం నాటిన వృక్షాలను జేసీబీతో పెకిలించి, కాల్చివేసిన ఘటనపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. పర్యావరణ ప్రేమికులు మారపెల్లి సునీల్ సమాచారంతో డిప్యూటీ రేంజర్ వై. కోటేశ్వర్ రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పక్షులకు నిలువ నీడ లేకుండా చేసిన నిందితులను గుర్తించి, వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## చూస్తే కిరాణం.. వెళ్తే మద్యం

- బార్లను తలపిస్తున్న బెల్టు షాపులు!
- శాయంపేటలో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కిరాణం షాపుల ముసుగులో లోపల మద్యం విక్రయించడమే కాకుండా, ఫ్రిడ్జులు ఏర్పాటు చేసి మరీ 'సిట్టింగ్' వసతి కల్పిస్తున్నారు. పగలే యువత మద్యానికి బానిసవుతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టు షాపులపై కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.



తమిళనాడు

## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- రూ.15.20 లక్షల విలువైన 95 గ్రాముల బంగారం స్వాధీనం
- ఐదు దొంగతనాల గుట్టురట్టు
- నిందితులు మధురై వాసులు



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను వరంగల్ సీసీఎస్, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల నుండి సుమారు రూ.15.20 లక్షల విలువైన 95 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన కళ్యాణ సుందరం, సెల్వరాజ్ ఉన్నారు. నిందితుడు కళ్యాణ సుందరం గతంలోనూ గంజాయి విక్రయాలు, వాహనాల చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండి జైలు శిక్ష అనుభవించిన పాత నేరస్థుడు. జైలు నుండి విడుదలయ్యాక సెల్వరాజ్‌తో కలిసి సులభంగా డబ్బు సంపాదించడం కోసం చైన్ స్నాచింగ్‌లను వృత్తిగా మార్చుకున్నారు. వీరిద్దరూ గత నెలలో వరంగల్ నగరానికి చేరుకున్నారు. తొలుత మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించి, దానిపై తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులను తెంచుకునేవారు. ఈ క్రమంలో సుబేదారి పరిధిలో 2, హన్మకొండ పరిధిలో 1, కేయుసి పరిధిలో 1, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు (3వ పట్టణ పోలీస్ స్టేషన్)లో 1 మొత్తం ఐదు చోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు.

### పోలీసుల వేట ఇలా..

వరుస దొంగతనాలతో అప్రమత్తమైన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. టెక్నాలజీ సహాయంతో నిందితులను గుర్తించిన పోలీసులు, వారిపై నిఘా పెట్టారు. మంగళవారం నిందితులు తిరిగి దొంగతనం చేసేందుకు హన్మకొండ బస్ స్టాండ్ నుండి పబ్లిక్ గార్డెన్ వైపు వస్తుండగా, పోలీసులు వారిని వెంబడించి చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన డీసీపీ దార కవిత, అడిషనల్ క్రైమ్ డీసీపీ జి. బాలస్వామి, ఏసీపీలు పి సదయ్య, పి నర్సింహరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, రామకృష్ణ, సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# మంత్రి పదవి రేసులో దొంతి!

## 2023లోనే మంత్రివర్గంలో స్థానం ఆశించిన మాధవరెడ్డికి నిరాశ

### ఆ తర్వాత జరిగిన కేబినెట్ విస్తరణలోనూ దొంతికి దక్కని చాన్స్

- ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత త్వరలో జరగనున్న కేబినెట్ విస్తరణ
- ఈసారి సీనియారిటీ కోటాలో మాధవరెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు లభించే అవకాశం
- మారిన సమీకరణల నేపథ్యంలో ఆయనకు కేబినెట్ లో బెర్త్ ఖాయమని పార్టీ శ్రేణుల విశ్వాసం

అక్షరదర్బార్, వరంగల్ : త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనుందనే ప్రచారం నేపథ్యంలో మంత్రి పదవికి మరోసారి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం పార్టీలో మారిన సమీకరణల దృష్ట్యా ఈసారి కచ్చితంగా ఆయనకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కనుందని కాంగ్రెస్ శ్రేణులు, దొంతి అనుచరులు, అభిమానులు విశ్వసిస్తున్నారు. ఇదిలా ఉంటే మాధవరెడ్డి కూడా మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డికి చోటు లభించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మాధవరెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ ఎమ్మెల్యే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో పదింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ పదీ స్థానాల నుంచి శాసనసభకు ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా మాధవరెడ్డి కాంగ్రెస్ లోనే కొనసాగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లను సాధించిన కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్ లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. మంత్రివర్గంలో మొదటిసారే ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవ రెడ్డికి చోటు లభించవచ్చని కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు, అభిమానులు ఆశించారు. అయితే సమీకరణల దృష్ట్యా మాధవరెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వరంగల్ తూర్పు, ములుగు నియోజకవర్గాల నుంచి శాసనసభకు ఎన్నికైన కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క మంత్రివర్గంలో స్థానం పొందారు. ఆ తర్వాత జరిగిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో కూడా మాధవరెడ్డికి అవకాశం లభించలేదు.


### త్వరలో మంత్రివర్గ విస్తరణ

త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనుందని తెలిసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాక, ఈనెల 15 తర్వాత రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగవచ్చనే టాక్ వినబడుతుంది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న వారిలో ఐదుగురిని పక్కనపెట్టి వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించవచ్చని ప్రచారం జరుగుతుంది. అలాగే ప్రస్తుతం మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలను కూడా పార్టీ అధిష్టానం భర్తీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో కొత్తగా ఐదుగురు ఐదుగురికి మించి రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం లభించవచ్చని పార్టీలో చర్చ జరుగుతుంది. ప్రధానంగా రాష్ట్ర మంత్రివర్గం నుంచి పార్టీ అధిష్టానం పక్కనపెట్టే ఐదుగురిలో ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఉండవచ్చని, ఆ స్థానంలో దొంతి మాధవ రెడ్డికి అవకాశం కల్పించవచ్చనే టాక్ వినబడుతుంది. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి మధ్య కొంత గ్యాప్ ఉండేది. కొద్ది నెలల క్రితం మాధవరెడ్డి తల్లి మృతి చెందిన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హనుమకొండకు వచ్చి దొంతిని పరామర్శించడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాధవరెడ్డికి మధ్య సత్సంబంధాలు బలపడ్డాయి. ముఖ్యమంత్రితో మాధవరెడ్డికి సన్నిహిత్యం పెరిగింది. పంచాయతీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నర్సంపేట పర్యటనకు వచ్చారు. ఆ తర్వాత కూడా సమీకరణలు పూర్తిగా మారిపోవడంతో ఈసారి మంత్రివర్గ విస్తరణలో మాధవరెడ్డికి స్థానం లభించడం ఖాయమనే విశ్వాసం కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు అభిమానుల్లో ఏర్పడింది. మాధవరెడ్డి కూడా మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం తన ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది.



### సర్పంచ్ గా రాజకీయ ప్రస్థానం

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి 45 సంవత్సరాలకుపైగా రాజకీయాల్లో ఉన్నారు. 1991 నుంచి 1998 వరకు చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా పనిచేశారు. అదే సమయంలో 1981 నుంచి 2014 వరకు అమీనాబాద్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ గానూ పనిచేశారు. 1995 నుంచి 2000 వరకు వరంగల్ కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించారు. 2012 నుంచి 2014 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థిత్వం దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా నర్సంపేట నియోజకవర్గం నుంచి బరిలో దిగి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. బీఆర్ఎస్ అధిష్టానం తమ పార్టీలో చేరాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినప్పటికీ మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడలేదు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సంపేట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన ఆయన ఓడిపోయారు. ఆ తర్వాత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి నర్సంపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగి ఉండటం, సీనియర్ ఎమ్మెల్యే అయినందున 2023 డిసెంబర్ లో ప్రభుత్వం ఏర్పడిన సమయంలోనే రాష్ట్ర మంత్రివర్గంలో మాధవరెడ్డికి చోటు దక్కుతుందని ఆశించిన ఆయన అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు కొంత నిరాశకు గురయ్యారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915